# మల్లాది ఫోటో కథ

మల్లాది వెంకటకృష్ణమూర్తి అనగానే 'ఫోటో వేయించుకోడానికి ఇష్టపడని రచయిత' అన్న విషయం పాఠకుల్లో బాగా పాతుకు పోయింది. నన్ను కలిసిన అభిమానులు, పాఠకులు అడిగే మొదటి మూడు ప్రశ్నల్లో అదొకటి. 'మీ ఫోటో ఇంతదాకా ఏ పత్రికలలో ఎందుకు ప్రచురించబడలేదు?' అన్న ప్రశ్నకి అనేక వందలసార్లు జవాబు చెప్పాను.

వ్యక్తిగతంగా అందుకు ఇష్టం లేకపోవడమే కారణం.

హైద్రాబాద్ ఆకాశవాణిలో 'వినాయకరావు పెళ్ళి' అనే నా నవల ధారావాహికంగా ప్రసారం అయాక జరిగిన ఇంటర్వ్యూలో కూడా అదే ప్రశ్న అడిగింది కుమారి ప్రభావతి.

సందర్భాన్నిబట్టి ఆ ప్రశ్నకి రక రకాల సమాధానాలిస్తుంటాను. అవి....

* మొహం చిన్నప్పుడే కాలిపోయింది కాబట్టి.
* బాపుండను కనక.
* పాఠకులు రచయితగా నేనెలా వుంటానో ఫోటో చూడకుండా వూహించుకోవాలని.
* బొల్లి ఉంది కాబట్టి.
* ఫోటోల రేట్లు ఎలా వున్నాయో తెలిస్తే మీరా ప్రశ్న అడగరు.
* ప్రేమ లేఖలు వస్తాయని.
* వచ్చే ప్రేమ లేఖలు ఆగిపోతాయని.

తోటి రచయితలని అడిగితే వాళ్ళిచ్చే సమాధానాలు కూడా పై ప్లస్ 'అలా క్రేజ్ మెయిన్‌టెయిన్ చేయాలనుకుంటున్నాడు గురుడు' అని అంటారు. అయితే చాలా కొద్దిమంది రచయితలే నన్ను చూసారు' నేటి పాపులర్ రచయితల్లో కొందరిని వదిలేస్తే.

ఆంధ్ర పత్రిక, ప్రభల్లో దీపావళి కథల పోటీలో గెలుపొందిన బహుమతి గ్రహీతల ఫొటోలు పరిచయంతో పాటు వేస్తూండేవారు. నేను చాలా కథలు ఆ పోటీలకి పంపినా ఒక్కసారి కన్సోలేషన్ బహుమతి కూడా రాలేదు.

1974లో తొలిసారిగా 'తరుణ' అనే మాసపత్రిక ఎడిటర్ శ్రీ బాసాని సుదర్శన్‌రెడ్డి రచయితల ఫోటోలని తన మంత్లీ మేగజైన్ ముఖచిత్రాలుగా వేస్తూండేవారు. యద్దనపూడి, కౌసల్యాదేవి, వాసిరెడ్డి సీతాదేవి, కొమ్మూరి వేణుగోపాలరావు మొదలైనవారి ఫోటోలు ఆ విధంగా వేశారు. (పేను పేరు చెప్పని ఓ రచయిత్రి ఫోటో వేస్తే ఆవిడని ఎరిగిన వారు 'శోభనం గదిలోకి వెళ్ళబోతూ తీయించుకున్న ఫోటోలా ఉంది' అని కామెంట్ చేశారు) నా ఫోటో కూడా అడిగారు రెడ్డిగారు. నేను 'నో' అంటే అది బ్రతిమాలించుకోవడానికి అనుకున్నారు. కాని నిజంగా 'నో' అన్నానని తెలిసాక ఆశ్చర్యపోయారు. 'డబ్బిచ్చి ఫోటోలు వేయించుకునే ఈ రోజుల్లో ఏమిటిది?' అన్నారు. ఫోటో ఇస్తే నూట పదహార్లు ఇస్తానని కూడా అన్నారు. బట్, నా మనసు లొంగలేదు.

అది నేను పాస్ అయిన మొట్టమొదటి ఫోటో పబ్లికేషన్. ఆ తర్వాత అనేక సందర్భాల్లో దాదాపు అన్ని పత్రికా సంపాదకులు నా ఫోటో అడగడం, నేను ఇవ్వకపోవడం జరుగుతూ వస్తోంది. ఆంధ్ర భూమి వీక్లీ కవర్ పేజీలుగా రచయితల ఫోటోలు కొందరివి వేసే వారు. ఆ పత్రిక ఎడిటర్ 'మీ ఫోటో ఎప్పటికయినా రాకతప్పనప్పుడు, ఇప్పుడు మా వీక్లీకి ఇవ్వడమే మంచిది. లార్జెస్ట్ సర్క్యులేటెడ్ వీక్లీ. ఇంత మంచి అవకాశం మళ్ళీ మళ్ళీ రాదు' అన్నారు. 1983_84లలో ఆయన చెప్పిన మాట వాస్తవమే. ఆ రోజుకి ఏ వారపత్రికా సర్క్యులేషన్‌లో తెలుగులో ఆ వారపత్రిక ఫిగర్‌ని టచ్ చేయలేకపోయింది అన్నమాట ఒప్పుకుని తీరాలి. ఫోటో విషయంలో నా పాలసీ చెప్పానాయనకి.

'నేను బ్రతికుండగా నా ఫోటో అచ్చవడం నాకిష్టంలేదు. నేను మరణించాక నల్లబోర్డరుతో మొదటిసారి రావాలన్నది నా కోరిక.' ఆ తర్వాత పల్లకి వీక్లీ, నేను ఎడిటర్‌గా మొదలైన స్రవంతి వీక్లీ అధినేత

కందనాతి చెన్నారెడ్డి కూడా నా ఫోటో కవర్ పేజీగా వేస్తామని కోరారు.

'మీరు ఎడిటర్‌గా వున్న పత్రిక ముఖచిత్రంగా మీది వేయడం సబబు' అన్నారు. నిరాకరించాను.

'వినాయకరావు పెళ్ళి' సీరియల్‌ని తొలిసారిగా ఆంధ్రపత్రికకి రాసినప్పుడు దాని ఎడిటర్ శ్రీమాధవరావు కూడా నా ఫోటో కవర్ పేజీగా వేయాలనుకున్నారు. వప్పుకోలేదు. ఆంధ్రజ్యోతి వీక్లీలో నా సీరియల్ వచ్చినప్పుడల్లా దాని సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు, తోటకూర రఘుగారు నా ఫోటో వేయాలని అడిగారు కాని ససేమిరా అన్నాను.

అన్నిటికన్నా ముఖ్యమయిన రెండు అవకాశాలు వదులుకున్నాను. 'వినాయకరావు పెళ్ళి, వెడ్డింగ్ బెల్స్' అనే నా నవలలు కన్నడంలో సినిమాలుగా వచ్చాయి. ఆ రెంటి దర్శకుడు శ్రీ ఫణి రామచంద్ర సినిమాలో టెక్నిషియన్స్‌ని చూపించారు. నన్ను కథా రచయితగా చూపించదలచి బెంగుళూరుకి ఫలానా రోజుకి రాగలరా, టిక్కెట్ అరెంజ్ చేస్తామన్నారు. ఫొటోలోనే కనబడదలచుకోలేని నేను మరి పెద్ద తెరమీద కనబడ టానికి టెంప్ట్ అవుతానా?

చిన్న తెరమీద కూడా కనబడమని ఆహ్వానం వచ్చింది. నేటి తెలుగు నవలలమీద 'సాక్షి' శీర్షికలో ఓ ఐటం కోసం నన్ను ఇంట్రవ్యూ చేయాలనుకుని ఫోన్ చేసారు హైద్రాబాద్ దూరదర్శన్‌వారు. మర్యాదగా తిరస్కరించాను. (ఆ ప్లేస్‌లో ఓల్గాగార్ని ఇంట్రవ్యూ చేసారు.)

పబ్లిసిటీని అధికంగా కోరుకునే నేటి సమాజంలో, రచయితల ఫోటోలు విరివిగా అచ్చయ్యే ఈ తరుణంలో 'నేను ఫోటో ప్రచురణకి అంగీకరించను' అన్న పాలసీ అండర్‌లైన్ చేసినట్లుగా పాఠకుల్లో పాకి పోయింది. దాంతో నా ప్రమేయం లేకుండానే 'మల్లాది ఫోటో ప్రచురణ కివ్వడు' అన్న విషయం పాఠకులకి గుర్తుండిపోయే పాయింట్ అయింది. ఏతావాతా 'ఇది మల్లాది చేసుకుంటున్న మరో రకం కొత్త పబ్లిసిటీ' అను కునేవారు కూడా లేకపోలేదు. కాని 1974 లో ఫోటో ఇవ్వకపోవడం

పబ్లిసిటీ అనుకుని నేనా పాలసీని నమ్ముకోలేదు.

నాకు వ్యక్తిగతంగా 'ప్రచారం' అంటే గిట్టదు. సన్మానాలు, పొగడ్తలు లాంటి వాటిని ద్వేషించే మనస్తత్వం నాది.

'మల్లాదిగారు. మీరు కావాలనుకున్నా వద్దనుకున్నా పబ్లిక్ మనిషి మీ ఫోటో విషయం మీరు కాదు. పాఠకులు నిర్ణయించాలి' అన్నారు నా సీరియల్ వేస్తున్నప్పుడు బలరాంగారు. ఆ ప్రకారం స్వాతి వీక్లీలో 'మల్లాది ఫోటో వేయాలా వద్దా' అన్న అంశం మీద బాలెట్‌ని నిర్వహించడం జరిగింది. తర్వాత దాని ఫలితాలు అందులో ప్రకటించారు. శాతం గుర్తులేదు కాని అధిక శాతం మంది 'ఫోటో వేయించుకోకుండా ఇలా అజ్ఞాతంగానే ఉండండి' అని సలహా ఇచ్చారు పాఠకులు. రచయితలనేక మంది (పురాణంగారి మాటల్లో చెప్పాలంటే చెవిలో పెన్నుతో) అప్పటికే తమ ఫోటోలని అనేక రకాలుగా పాఠకుల మీద రుద్దడంతో వారు విసిగిపోయిన సలహా అనుకున్నాను.

చాలామంది రచయితల ఫోటోలు నేటికీ వారి రచనల అట్టలమీద దర్శనం ఇస్తుంటాయి. నాకు తెలిసిన చాలామంది పాఠకులు దాన్ని గర్హిస్తూంటారు కాబట్టి నేను అనుకున్న పద్ధతి మంచిదే అనిపిస్తూంటుంది నాకు.

నిజానికి నేను తీయించుకున్న ఫోటోలు చాలా తక్కువ. నా ఆరో ఏట తీయించుకున్న ఫోటో ఒకటి, ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్ష హాల్ టికెట్‌కి, హైదరాబాద్‌లో బస్‌పాస్‌కి, ఉద్యోగానికి అప్లై చేసినప్పుడు మాత్రమే. అంతకుమించి అవసరం రాలేదు.

1972 దాకా ఇవే నాకున్న ఫోటోలు. ఆ తర్వాత 1982 దాకా నేను ఫోటో స్టూడియోకు వెళ్ళలేదు. 82 తర్వాత తీయించుకున్న ఫోటోలు చాలా.

విజయచిత్ర ఆఫీసువారు, ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ ఉదయవర్లు గారు, ఫోటోగ్రఫీ అభిరుచిగల సి.కె. రాజుగారు, నాఫోటోలుతీశారు కాని ప్రచురణకోసం కాక కేవలం ఆల్బంకోసమే అన్న జెంటిల్‌మెన్స్ అగ్రిమెంట్‌తో. అవి తీసి పదేళ్ళు దాటుతున్నా ఇంకా ఆ అగ్రిమెంటుని అలాగే

కంటిన్యూ చేస్తున్నందుకు నాకు ఆనందంగా ఉంది. అలాగే బంధుమిత్రుల పెళ్ళిళ్ళల్లో, నేను యూరప్‌లోని ఏడు దేశాలు, అమెరికా, కెనడా దేశాలు పర్యటించినప్పుడు కొన్ని వందల ఫోటోలు తీయించుకున్నాను.

కొత్తవాళ్ళతో ఫోటోలు తీయించుకోవడానికి అంగీకరించను. కారణం. తెలీక వారు పంపితే, తెలిసీ తెలీక ఏ పత్రికవారో ప్రచురిస్తారన్న భయం. అప్పటికీ ప్రచురణకి పంపం అన్న హామీఇచ్చి చాలామంది నాతో ఫోటోలు తీయించుకున్నారు పెళ్ళిళ్ళ లాంటి సందర్భాల్లో.

పత్రికా రచయితగా ఉన్నంత కాలం ఏం ఇబ్బంది ఉండదు. సినీరైటర్‌గా మారాక అనేక సందర్భాల్లో ఫోటో విషయంలో ఇబ్బంది పడ్డాను. ముఖ్యంగా సినిమా ముహూర్తం రోజు కొబ్బకాయ కొడుతుండగా, తొలి షాట్ చిత్రీకరణ తర్వాత ఫోటోలు తీస్తారు జర్నలిస్ట్‌లు. సినిమా కంపెనీ ఆల్బంలో ఉన్నంత వరకు ఓ.కె. కాని జ్యోతిచిత్రకి, సితారకి ప్రచురణకు పంపితే కష్టం. నిర్మాత, దర్శకులని నా ఫోటో లున్న గ్రూప్ ఫోటోని పంపవద్దని ప్రత్యేకంగా రిక్వెస్ట్ చేస్తాను. పత్రికా రచనారంగంలోని నా పాలసీ తెలీనివారు నా రిక్వెస్ట్‌కి ముక్కుమీద వేలేసుకుంటారు. సినిమా ప్రపంచంలో ఎంత పబ్లిసిటీ, పబ్లిక్ ఎక్స్‌పోజర్ ఉంటే అంత మంచిదనుకుంటారంతా.

మొన్నటికి మొన్న పి.ఏ.పి. వారి చిత్రం 'గోల్‌మాల్ గోవిందం' పాట రికార్డింగ్ రోజున పత్రికా విలేఖరుల గోష్టిలో పాల్గొన్నప్పుడు పత్రికల్లో ప్రచురణకి వేయించిన, అంతా నిల్చుని ఉన్న గ్రూప్‌ఫోటోలో నేను లేను. కాని కూర్చుని ఉండగా తీసిన ఫోటోలు వేస్తే నేనుండేవాడిని. ఫోటో తిస్తున్నప్పుడు వద్దనలేం మిగతా వారికి ఫోటో మీద ఆసక్తి ఉంటుంది కాబట్టి. నేను లేచి వెళ్ళిపోతే ఎబ్బెట్టుగా ఉంటుంది. మద్రాస్ పాత్రికేయులు మంచివారు కాబట్టి నా కోరికని మన్నించి నేనున్న స్టిల్స్ ఎవాయిడ్ చేసి తమ పత్రికలకి పంపుతూంటారు.

ఫోటో ప్రచురించకపోవడం మీద నామీద నేనే సరదాగా ఓ కథ రాసుకున్నాను. 'అజ్ఞాత రచయిత' (అజ్ఞాన కాదు) దాని పేరు. రచయితగా నేను కలంపట్టి 1994 ఆగస్టుకి 24 ఏళ్ళు పూర్తయ్యాయి. ఇంతదాకా

నా ఫోటో వేయకుండా పత్రికా ఎడిటర్స్ అంతా కోఅపరేటివ్ చేస్తున్నారు. ఇకమీదట కూడా అలాగే కంటిన్యూ అవుతుందని ఆశిస్తాను.

ఎప్పుడయినా మీరు అచ్చులో నా ఫోటో చూశారంటే నేను మరణించానని అర్థం. లేదా బ్రతికున్న నన్ను 'చావరాదా' అన్న ఉద్దేశంతో దాన్ని ప్రచురించారని ఆ చర్యల ద్వారా అర్థం చేసుకుంటాను.

# పిచ్చే పడ్ గయె ఇన్‌కంటేక్స్

డబ్బు లేనివాళ్ళు ఆకలి అన్న పదానికి ఎలా భయపడతారో, డబ్బున్నవాళ్ళు అలాగే ఓ పదం వింటే వులిక్కిపడతారు. అది 'అజీర్తి లేదా కొలెస్ట్రాల్' అనుకుంటే పొరబాటే.

ఆ పదం ఇన్‌కంటేక్స్. ఓ సినిమా నిర్మాత నవ్వుతూ ఓసారి నన్నడిగాడు 'అసలైన టెర్రరిస్ట్ ఎవరో తెలుసా?' అని. నాకు తెలీదంటే 'ఇన్‌కంటేక్స్ ఆఫీసర్.... ఎక్కడయినా రాయండి' అన్నాడు.

డబ్బున్నవాళ్ళు ఇలా ఇన్‌కంటేక్స్ శాఖకి భయపడటానికి ప్రధాన కారణం టేక్స్‌ని ఇన్‌కంటేక్స్ చట్టప్రకారం కట్టకపోవడమే. ఓ ధనవంతుడు ఖర్చుచేసే ప్రతి ఖర్చు వెనక అతని స్వార్థం, ఆ ఖర్చు తాలూకు అనుభవం లేదా తృప్తి లభిస్తాయి. ఆఖరికి దానం ఇచ్చినా మానసిక తృప్తి లభిస్తుంది. లంచం యిచ్చినా పని జరుగుతుంది ఆ రెండు వృధా ఖర్చులయినా. కాని ఇన్‌కంటేక్స్ చెల్లిస్తే దానివల్ల కలిగే అనుభవం తాలుకు తృప్తి వుండదు. ఉన్నా తక్కువ కాబట్టి ఎవరికి వారు ఇన్‌కంటేక్స్ ఎగ్గొట్టాలని చూస్తుంటారు.

ఇన్‌కంటేక్స్ చెల్లింపుమీద చాలా జోకులు, వ్యాఖ్యానాలు వున్నాయి. ప్రభుత్వం నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్ష పాసవకుండా, జీతం తీసుకోకుండా ప్రభుత్వం కోసం పనిచేయడంట ఇన్‌కంటేక్స్ చెల్లించడమంటే. సంవత్సరం అంతా కష్టపడి పనిచేసి సంపాదించిన